క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



వాజేడు : ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో మండలంలోని అరుణాచలపురం అటవీ ప్రాంతంలోని గుడుంబా స్థావరాలపై సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సుమారు 800 లీటర్ల బెల్లం పానకాన్ని దాచి ఉంచగా గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే మండలంలోని జంగాలపల్లికి చెందిన అన్నెబోయిన రమాదేవి 50 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ శాఖకు సిబ్బందికి అప్పగించారు.

అతివేగం.. కేసు నమోదు

వాజేడు : అతివేగంగా నడుపుతున్న వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని కృష్ణాపురం సమీపంలోని బ్రిడ్జి వద్ద పేరూరు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌ఘడ్ వైపు నుంచి కూలీలతో అతివేగంగా ప్రయాణిస్తున్న బొలెరో వాహనం రావడంతో అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మడే నానబాబును ప్రశ్నించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరీశ్ తెలిపారు.

పరామర్శ



మంగపేట : మండలంలోని పాత చీపురు దుబ్బలో పలు కుటుంబాలను శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేశ్ శుక్రవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పెండెకట్ల సారమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించి రూ.1500లు నగదుతోపాటు పండ్లు అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన మద్దెల పిచ్చయ్య ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని నాగ రమేశ్ పరామర్శించి సంతాపం తెలిపారు. తదనంతరం రాజుపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన షాపులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగ రమేశ్‌ను షాపు యజమానులు శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ బాడిశ నవీన్, ఇందారపు నవీన్, మునిగల మహేశ్, మండల సంతోశ్, రాజు, శేఖర్, అర్జున్, బాలకృష్ణ, కొమరం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ శీలం మధు ఆధ్వర్యంలో ములుగు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి జన్మదిన వేడుకలను కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగజ్యోతి కేక్ కట్ చేసి మాట్లాడారు. ప్రజలకు, శ్రేణులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాంనాయక్, యువజన విభాగం నాయకుడు బైకాని సాగర్, నాయకులు తైరెడ్డి మహేందర్, జంగిలి రవితేజ, కోగిల మహేశ్, గొల్లపల్లి శ్రీనివాస్, బమైకాని వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

భూపాలపల్లి అర్బన్ : బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టు కొమ్మలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామ శివారులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై మాట్లాడారు. పాత వర్గం, కొత్త వర్గం అనే బేధం తనకు లేదని ఇద్దరు రెండు కళ్ల లాంటివారేన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్

మహదేవపూర్ : మండలంలోని కిష్టరావుపేటలో పోలీసులు శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడారు. అసాంఘీక శక్తులకు సహకరించొద్దన్నారు. గ్రామాల్లోకి అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లపై పాలకుల నిర్లక్ష్యం



ఎస్‌ఎస్ తాడ్వాయి : డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్‌ఎస్ తాడ్వాయి : స్కీమ్ వర్కర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరోజన, ప్రధాన కార్యదర్శి సమ్మక్క విమర్శించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సరోజన, సమ్మక్క మాట్లాడారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్కీమ్ వర్కర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మికులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జమున, రేణుక, బాణమ్మ, నిర్మల, ఆదిలక్ష్మి, సుమలత, రుక్మిణి, శ్రీకళ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం (ఎం) : సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకుడు బ్రహ్మాచారి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు సంధ్య, మాధవి, సౌజన్య, శోభ, రజిత, రమ, సాహేద, కవిత, ఇందిర, హేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్ (గోవిందరావుపేట) : జిల్లా కేంద్రంలోని, గోవిందరావుపేపట మండల తహసీల్దార్లకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు ఉపేంద్రచారి, రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఆదిరెడ్డి, చంద్రారెడ్డి, మురళి, నీలాదేవి, రజిత, రమ, కవిత, అరుణ, సనీత, నాగమణి, మంజుల, మమత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం (ఎం)లో..



గోవిందరావుపేటలో..



వెంకటాపురం (కె) : ర్యాలీ తీస్తున్న నాయకులు



వాజేడులో..

వెంకటాపురం (కె) : సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలో నిరసనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ అంటి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ కుమారి, సాదాలు, భిక్షపతి, రమణ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేయగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దబ్బకట్ల లక్ష్మయ్య మాట్లాడారు. కార్యక్రమంలో బచ్చలి కృష్ణబాబు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆదర్శంగా నిలవాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ రాజు, ఇతరులు

ఏటూరునాగారం : జర్నలిస్టులు ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సీఐ మండల రాజు ఆకాంక్షించారు. ఈనెల 8న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ద్వితీయ మహాసభల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి అఫ్జల్ ఆధ్వర్యంలో సీఐ రాజు శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వారధిగా నిలుస్తూ గ్రామ, మండల అభివృద్ధికి దోహద పడాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫలాలను జర్నలిస్టులు వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జూపాక కృష్ణ, నాయకులు నూక ప్రభాకర్, చిదురాల వాసు, వెంకటేశ్వర్లు, గంపల శివ, ఎగ్గడి వెంకటేశ్వర్లు, పర్వతాల లాలయ్య, అలువాల శ్రీనివాస్, అక్తర్ షా, లకుమయ్య, గౌరీశంకర్, రాకేశ్, శేఖర్, వసంత రమేశ్, గోవర్ధన్, బోడ సత్యం పాల్గొన్నారు.

కలెక్టర్, ఐటీడీఏ పీఓ, జెడ్పీ చైర్మన్‌లకు సన్మానం



వాజేడు : నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఏటూర్‌నాగారం ఐటీడీఏ పీఓ అంకిత్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌లను శుక్రవారం కలిసి శాలువా కప్పి సన్మానించారు. తొలుత వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మోహన్‌రావు, గంప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం'



కండువా కప్పుతున్న ఎంపీ బాబురావు

మంగపేట : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ పాలక్, ఎంపీ బాబురావు తెలిపారు. మండలంలోని కమలాపురంలోని బీఎంఎస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోడె శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శ్రేణులతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి బాపురావు హాజరై మాట్లాడారు. మండలంలోని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి మండలానికి చెందిన సుమారు 100 మంది పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు చింతలపుడి భాస్కర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, పాలసీ అండ్ రీసెర్చ్ కమిటీ సభ్యుడు రాజునాయక్, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ఏర్పాటుకు విరాళం



మంగపేట : మండలంలోని రాజుపేట గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ఏర్పాటు కోసం బందారపు జగన్ దంపతులు రూ.70,116లు విరాళం అందజేశారు. ఈ మేరకు దంపతులు విరాళం చెక్కును పూజారికి శుక్రవారం అందించారు. ఆలయంలోని ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోగా నూతన ధ్వజస్తంభం ఏర్పాటు కోసం గ్రామస్తులు నిర్ణయించుకోగా గతంలో వీఆర్వోగా పని చేసిన వెంకటేశ్వర్లు కుమారుడు జగన్ స్పందించి కుటుంబీకులతో కలిసి రూ.70,116లు విరాళం అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపాల్

మంగపేట : మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని, శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని కమలాపురం, మంగపేట, మల్లూరు, కోమటిపల్లి జెడ్పీ హైస్కూళ్లతోపాటు కమలాపురం ఆర్‌ఎంసీ, థాఫర్ విద్యా విహార్ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా కమలాపురం ఆర్‌ఎంసీ పాఠశాల విద్యార్థులు సాత్విక్, అఖిల్, రుషిత ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే కమలాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అక్షయ, శ్రావణి, కావ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలవగా మంగపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఫౌజియ, చందుశ్రీ, రాజేశ్ తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ వెంకటయ్య మెమొంటోలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సంతోశ్‌కుమార్, అనిల్‌కుమార్, రేణుకాదేవి, సతీశ్‌కుమార్, శైలేందర్, అశోక్, లక్ష్మణ్, చిరంజీవి, శ్యామ్, నరేశ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 నుంచి షటిల్ టోర్నమెంట్

ఏటూరునాగారం : సంక్రాంతి పండగ సందర్భంగా మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురంలో ఈనెల 11 నుంచి 14 వరకు డివిజన్ స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఖయ్యూం, లక్కి, ఖలీల్, గయాజ్, ఆఫ్రాజ్ అక్మల్, సిరాజ్, సంజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.300లు ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.10 వేల 116లు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేల 116లు, తృతీయ బహుమతిగా రూ.2 వేల 516లు నగదుతోపాటు అన్ని బహుమతులకు షీల్డ్ ఇవ్వనున్నట్టు వివరించారు. మరింత సమాచారం కోసం సెల్ నెంబర్ 8008200381, 9912613312ల్లో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఇళ్లు లేని పేద, నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో కనీసం సొంతిళ్లు కూడా కట్టుకునే అదృష్టం లేకుండా పోయిందని వాపోయారు. ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఇస్తానని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, నిరుపేద ప్రజలను మోసం చేస్తూ వస్తున్నాయని మండిపడ్డారు. పేద ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించి పేదలకు ఇచ్చిందన్నారు. ఈ నిరసన దీక్షలో మడిపడిగె సురేశ్‌కు చెందిన బహుజన కళామండలి బృందం పాడిన పాటలు దీక్షలో పాల్గొన్న వారిని ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు చిలుకూరి కరుణ, నాయకులు మండ రవి, మోకిరాల మధువంశీ కృష్ణ, రాజు, లింగయ్య, చిట్యాల మండల అధ్యక్షులు తిరుపతి, రమేశ్, రఫీ, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మల్హర్ : మండలంలోని వల్లెంకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను ఎంపీడీఓ నర్సింహమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

మంగపేట : భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ రమాదేవి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. భూసమస్య పరిష్కారం కోసం ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న వివిధ మాడ్యూళ్ల గురించి వివరించారు. భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతుల పత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బ్రాహ్మణపల్లి శివారులోని సర్వే నంబర్ 44లో తాము 40, 50 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నామని, తమకు పట్టాదార్ పాస్‌బుక్కులు ఇప్పించాలని పలువురు రైతులు ఆర్డీఓను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చొరవ తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు, ఆర్ఐ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ కేటాయింపునకు అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

మంగపేట : మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఇసుక క్వారీ కేటాయింపుపై గతంలో నిర్వహించిన పీసా గ్రామసభపై డీపీఓ కొండ వెంకయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్ల అభిప్రాయ సేకరణ కోసం సభ నిర్వహించారు. గ్రామంలో ఎర్రమ్మతల్లి, గౌరమ్మతల్లి సొసైటీల ఏర్పాటు కోసం సెప్టెంబర్ 19న పీసా గ్రామసభ నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామంలో 103 మంది గిరిజన ఓటర్లుండగా వారిలో 76 మంది ఎర్రమ్మతల్లి సొసైటీ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. 2010లో కొమరం భీమ్ సొసైటీ రిజిస్ట్రేషన్ అయ్యిందని, 1964 యాక్ట్ ప్రకారం రెండో సొసైటీ ఏర్పాటు చట్టవిరుద్ధమంటూ ఆ సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించగా అభిప్రాయ సేకరణ చేపట్టారు. సొసైటీ ఏర్పాటు నిబంధనలను డీసీఓ సర్దార్‌సింగ్ ఓటర్లకు వివరించారు. కొమరం భీం సొసైటీ ఉందనే విషయం తెలియక ఎర్రమ్మతల్లి సొసైటీ ఏర్పాటుకు అమోదం తెలిపామని కొందరు అధికారులకు తెలిపారు. గతంలో నిర్వహించిన గ్రామసభలో తమకు నిబంధనలు చెప్పలేదన్నారు. 2010లో రిజిస్ట్రేషన్ అయిన కొమరం భీమ్ సొసైటీ రికార్డులను పరిశీలించిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. ఓటర్లు నాలుగు రోజుల్లో ఏకాభిప్రాయం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ఏటూరునాగారం ఐటీడీఏ పీసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ పాడి వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదవరాజు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



భూమిపూజ చేస్తున్న చైర్మన్ సంపత్‌గౌడ్

ఎస్‌ఎస్ తాడ్వాయి : రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు కాటాపూర్ పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్ తెలిపారు. మండలంలోని కాటాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన గోదాము నిర్మాణానికి వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య, సర్పంచ్ పుల్లూరి గౌరమ్మలతో కలిసి చైర్మన్ సంపత్ శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం చైర్మన్ సంపత్ మాట్లాడారు. రైతులు ఎరువులు నిల్వ చేసుకునేందుకు వినియోగించుకునేలా గోదాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. సంఘం బలోపేతానికి రైతులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ స్వాతి, డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, రంగరబోయిన జగదీశ్, కోఆప్షన్ సభ్యుడు దిలావర్ ఖాన్, నాయకులు ముజాఫర్ హుస్సేన్, నర్సయ్య, అనందం, కొమురయ్య, మద్దూరి రాములు, సాగర్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహేందర్

వాజేడు : సీజనల్, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారి కొమరం మహేందర్ తెలిపారు. మండలంలోని బిజినేపల్లి గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలు, దగ్గు, జలుబు, తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందించారు. అలాగే బాలింతలు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా రోగాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మేకల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మేకలు పంపిణీ చేస్తున్న పుష్పలత రెడ్డి

ఎస్‌ఎస్ తాడ్వాయి : మేకల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని వృత్తి స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పుష్పలత రెడ్డి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహకారంతో ఆ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అంకంపల్లి, వీరపూర్ గ్రామాల్లోని సన్న, చిన్నకారు రైతులకు శుక్రవారం 60 మేకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుష్పలత రెడ్డి మాట్లాడారు. తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లోని సుమారు 200 మంది రైతులకు మేకలను పంపిణీ చేసేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా రైతులకు కూడా అందిస్తామన్నారు. మేకలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో వ్యాధుల నివారణ కోసం పశు వైద్యాధికారి సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు అఖిల్, బాలమహేందర్, ప్రశాంత్, మారుతి, కోఆర్డినేటర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ములుగు రూరల్ : మండలంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యార్థులకు హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హాస్టళ్లలో అత్యధికంగా పేద విద్యార్థులే ఉంటారని, వారిని నిర్లక్ష్యం చేయడం వివక్ష పాటించడమేనని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి చెల్లించాలని, అన్ని హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు రమేశ్, రాకేశ్, శివకేశవ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.